

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35 (సోమవారం)
కనిష్ఠం : 28

వైభవంగా వీరేశ్వరస్వామి రథోత్సవం 7

కలెక్టరేట్‌లో 200 అర్జీల స్వీకరణ



ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్

అమలాపురం టౌన్, మేే5(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో ఫిర్యాదుదారుల సంతృప్తే లక్ష్యంగా జవాబుదారీతనంతో వాటికి పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, డ్వామా, డీఆర్డీఏ పీడీలు మధుసూదన్, జైచంద్రగాంధీ, ఎస్డీసీ కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు తదితరులు ఫిర్యాదుదారుల నుంచి 200 అర్జీలను స్వీకరించారు. ప్రతీ అర్జీ స్థాయి అంచనా వేసి ఫిర్యాదును విశ్లేషించి న్యాయపరంగా పరిష్కారం చూపినప్పుడే ఈ తరహా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా, ఒకే ఫిర్యాదు మళ్లీమళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వర పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా అర్జీల స్థాయిని బట్టి పెండింగ్‌లో లేకుండా పరిష్కారం చూపాలన్నారు. అనర్హత ఉంటే తగిన కారణాలను అర్జీదారులకు వివరించాల్సిందిగా జేసీ సూచించారు. జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి 24 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతులను అందించారు.

ద్రాక్షారామలో రూ.11.5 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు



- మంత్రి సుభాష్
- ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 5 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో రూ.11.5 కోట్లతో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుచేస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ద్రాక్షారామ సమీపంలో ఆదివారపుపేట గురుకుల పాఠశాల వద్ద ఈ పార్కు నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోందని, ఇందులో భాగంగా 2027-28 నాటికి 15వేల ఎంఎస్ఎంఈలు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటి ద్వారా 2 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇండస్ట్రియల్ పార్కులకు రూపకల్పన చేసిందన్నారు. మేడే సందర్భంగా సీఎం చంద్రబాబు పది నియోజకవర్గాల్లో 30 ఎంఎస్ఎంఈలకు శంకుస్థాపన చేశారని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఏర్పాటుచేసే పారిశ్రామిక పార్కులో ఉపాధి కల్పనలో భాగంగా నియోజకవర్గంలో భర్తను కోల్పోయిన 40 ఏళ్లలోపు మహిళలు 160 మందిని గుర్తించామని, వారికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలు స్థాపించుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పరిశ్రమ పెట్టాలనుకునేవారు ముందుకువస్తే బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా వారికి సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ఒక పారిశ్రామికవేత్త ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఎంఎస్ఎంఈల పార్కుల నిర్మాణంతో వేలాది మంది ఉపాధి పొందుతారని చెప్పారు.

అన్నదాతకు.. ఆనందమే!



అన్నదాత సుఖీభవ అమలుకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో కసరత్తు
- ఈనెల 20కే అర్హుల జాబితా
- అనర్హుల వడపోత
- కొత్తగా మార్పులుచేర్పులు
- అధికారులకు లాగిన్
- 4.85 లక్షల మందికి లబ్ధి
- రూ.970 కోట్ల నిధులు అవసరం
- కౌలు రైతులకూ వర్తింపు
- 1.80 లక్షల మందికి మేలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెలలోనే అమలు చేయనున్నట్టు ప్రకటించింది. కుటుంబం యూనిట్‌గా రైతుకు రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో సాయం అందించడానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు పథకం అమలుకు వీలుగా రైతుల వివరాలను సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా అందుకున్న అన్నదాతల జాబితా వడపోతకు సన్నాహాలు ఆరంభించారు. వీరికి ప్రభుత్వం తాజాగా లాగిన్‌లు కేటాయించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులు అర్హులుగా తేలనున్నారు. రూ.970కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

రైతన్నకు ఆర్థిక భరోసాయే..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. అందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించింది. రైతు భరోసా పేరుతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు జగన్ ప్రభుత్వం తూట్లు పొడిచి కేవలం కేంద్ర వాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి చేతులు దులిపేసుకున్న తీరును తప్పుబట్టింది. ఈనేపథ్యంలో రైతులకు అండగా ఉండడానికి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల బడ్జెట్‌లో పథకానికి రూ.6,300 కోట్లు కేటాయించారు. పథకం అమలెప్పుడా అని రైతులు ఎదురుచూస్తోన్న తరుణంలో ఎట్టకేలకు సీఎం చంద్రబాబు రైతులకు తీపికబురు అందించారు. పథకాన్ని ఈ నెలలో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం తాజాగా అన్ని జిల్లాల వ్యవసాయ శాఖలకు గత వైసీపీ హయాంలో రైతు భరోసా పథకం తీసుకున్న అన్నదాతల జాబితాలను పరిశీలనకు పంపించింది. వీటిని మండలస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వడపోత పోయాలని ఆదేశించింది. ఇప్పుడు మండలాలవారీగా అధికారులకు జాబితాలో మార్పులు చేర్పులకు వీలుగా లాగిన్‌లు సైతం కేటాయించింది. ప్రభుత్వం పంపిన జాబితాను రెండు వారాలపాటు అధికారులు మండల స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అనంతరం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల వారీగా పథకం పరిధిలోకి ఎంతమంది రైతులు వస్తారనే దానిపై జాబితా తయారుచేస్తారు. అనర్హులను తొలగిస్తారు. ఆదాయపన్నుదారులు ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాములను గుర్తించి పేర్లను తప్పించనున్నారు. కొత్తగా అర్హులను గుర్తించి జాబితాలో చేర్చనున్నారు. ఈనెల 20 నాటికి అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేయనున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున రూ.970 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

కౌలు రైతులకు పండగే..

ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది వరకు అన్నదాతలు పథకం అమలు కిందకు రానున్నారు.అయితే రాష్ట్రప్రభుత్వం సాధ్యమైనంత ఎక్కువమంది రైతులకు పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది.గత వైసీపీ హయాంలో రకరకాల సాకులతో అర్హులను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టేసింది. ఈ నేపథ్యంలో అన్నదాతలను ఇబ్బంది పెట్టకుండా దాదాపు అందరికీ లబ్ధి చేకూర్చాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కొత్తగా కౌలు రైతులను పథకం పరిధిలోకి తేవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో 65 వేలు, కోనసీమ జిల్లాలో 61 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 54 వేల మంది వరకు అన్నదాతలు పథకం పరిధిలోకి రానున్నారు.ఒకరకంగా కౌలు రైతులకు ఇది వరమే అని చెప్పాలి. ప్రస్తుతం కౌలు రైతు కార్డులు కలిగిన వారినే అధికారులు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇవిలేని వారిని పథకం పరిధిలోకి తీసుకువస్తే జాబితా మరింత పెరగనుంది. మరోపక్క గత ప్రభుత్వం వీరిని అసలు రైతులుగానే పరిగణించలేదు. కానీ కూటమి ప్రభుత్వం వీరిని కూడా అర్హుల జాబితాలోకి చేర్చింది.అటవీ భూములపై హక్కులు (ఆర్ఓఎఫ్ఆర్) కలిగిన అన్నదాతలకు పథకం ఇస్తున్నట్టు ప్రకటించింది. దీనివల్ల కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు,శంఖవరం, రౌతులపూడి మండలాల్లో అటవీభూములు సాగు చేస్తోన్న వెయ్యి మంది వరకు అన్నదాతలకు ఆర్థిక లబ్ధి కలగనుంది. గతంలో వీరిని ఏప్రభుత్వంకనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.

వర్రీ.. తీరినట్టే!



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

రైతుల సమస్యకు.. మూడు పరిష్కారాలు

- ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెంపు
- జిల్లాలో మరో 2 లక్షల టన్నులు
- తేమశాతం 22 ఉన్నా కొనాలి
- మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ 1:2
- అధికారుల తీరుపై అసహనం
- వాడివేడిగా మంత్రి నాదెండ్ల సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో సోమవారం సాయంత్రం మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, జేసీలతో సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ని అదనంగా పెంచామని తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు, కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేల టన్నులకు అదనంగా మరో 50 వేల టన్నులు పెంచామన్నారు. గత 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.11,400 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తేమ 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను ఆదేశించారు. కోనసీమలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీని 1:1 ఇవ్వడంపై మంత్రి అటు జేసీ, ఇటు సివిల్ సప్లయిస్ అధికారుల వివరణ కోరారు. ఎమ్మెల్యేల సూచన, మిల్లర్ల కోరిక మేరకు బ్యాంకు గ్యారెంటీ 1:2 ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకూడదు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన హామీలు కచ్చితంగా అమలు చేయాలన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం...

ధాన్యం కొనుగోలు విషయమై మంత్రి మనోహర్ వద్ద అనపర్తి, జగ్గంపేట, మండపేట, కొత్తపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు కాకినాడ,తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల అధికారులపై పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోనసీమ జేసీ ధాన్యం సేకరణపై ఇచ్చిన వివరణలపై మంత్రి మనోహర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ధాన్యం కొనుగోలు అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ అడిగిన ప్రశ్నలకు జేసీ చినరాముడు సరిగా స్పందించకపోవడంతోపాటు ఎమ్మెల్యే నెహ్రూ చెప్పిన విషయాలపైనా ఆయన పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో మంత్రి అసహనం వ్యక్తంచేశారు. ఒక దశలో జేసీని ప్రత్యేకంగా కలవాలని సూచించారు. అటు సివిల్ సప్లయిస్ డీఎంపైనా తనదైనశైలిలో మండిపడ్డారు. పదే పదే తమకు ఎమ్మెల్యేలతో ఫోన్లు చేయించడమేంటని.. క్షేత్రస్థాయిలో తిరగాలని సూచించారు. ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న అంశాలను కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మంత్రికి వివరించారు. అనంతరం మూడు జిల్లాల జేసీలు ఇప్పటివరకు తమ జిల్లాల్లో రబీ ధాన్యం సేకరణ ప్రగతిని వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యానికి మద్దతు ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. రైతు సేవా కేంద్రాల టార్గెట్ పెంచాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. జిల్లాలో కొనుగోళ్ల పెండింగ్ రూ.16.75 లక్షల కమీషన్ చెల్లింపు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో 40 శాతం ధాన్యం రోడ్డుపైనే ఉందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల జేసీలు చినరాముడు, టి.నిషాంతి, మూడు జిల్లాల రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్న రామకృష్ణ (కాకినాడ), కర్రి వెంకటరెడ్డి (తూర్పు గోదావరి), చౌదరి (కోనసీమ) పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొంటాం : దుర్గేష్

రాజమహేంద్రవరం: ధాన్యం సేకరణ విషయంలో వైసీపీ అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ధాన్యం అమ్మకాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీంతో మరో 50 వేల టన్నుల సేకరణకు అనుమతి లభించిందని చెప్పారు.



సమావేశానికి హాజరైన నాయకులు, అధికారులు



అముడా భేటీలో పాల్గొన్న వైస్‌చైర్మన్, జేసీ నిషాంతి, చైర్మన్ స్వామినాయుడు

జిల్లా అంతా అముడా పరిధిలోకి తేవాలి

- అథారిటీ కార్యకలాపాలు పారదర్శకంగా నిర్వహించాలి
- బోర్డు కమిటీ తొలి భేటీలో వైస్‌చైర్మన్ జేసీ నిషాంతి పిలుపు

అమలాపురం, మే5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అముడా) కార్యకలాపాలను సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, అముడా ఉపాధ్యక్షురాలు టి.నిషాంతి విజ్ఞప్తిచేశారు. సోమవారం అమలాపురంలోని నల్లవంతెన వద్ద గల అముడా కార్యాలయంలో చైర్మన్ అల్లాడ స్వామినాయుడు అధ్యక్షతన బోర్డు సభ్యులతో కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. అముడా కార్యకలాపాల తీరు, ప్రతిపాదనలపై పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ అముడా పరిధిలో భవన నిర్మాణాలు, అనుమతులు, పంచాయతీల నుంచి ఆన్‌లైన్‌లో డెవలప్‌మెంట్ చార్జీలు వసూలుచేసే సాఫ్ట్‌వేర్ గురించి చర్చించారు. అముడా పరిధిలో మూడు నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని, మిగిలినవి రుడా పరిధిలో ఉన్నందున జిల్లా అంతా యూనిట్‌గా చేసి అముడాలోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఉపయోగపడేవి ఉంటే అముడాకు అప్పగించాలని జిల్లా యంత్రాగాన్ని కోరుతూ బోర్డు తీర్మానించింది. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ అథారిటీ అభివృద్ధికి సభ్యులంతా సలహాలివ్వాలని కోరారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు, ఆర్అండ్‌బీఎస్ఈ బి.రాము, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వీకేపీ ప్రసాద్, ప్లానింగ్ అధికారి ఎ.సత్యమూర్తి పాల్గొన్నారు.

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : వైసీపీ

అమలాపురం,మే5(ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతుల నుంచి కొనుగోలుచేసి మద్దతు ధర కల్పించాలని తడిసిముద్దయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయడానికి చర్యలు చేపట్టాలని జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వైసీపీ నాయకులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా వైసీపీకి చెందిన జిల్లా నాయకులంతా కలెక్టర్ చాంబర్‌లో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

నేడు, రేపు ఈసెట్

అమలాపురం, మే5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈసెట్) మంగళవారం, బుధవారాల్లో చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్, బీవీసీ కళాశాలల్లో సమర్థవంతగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ ఎన్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 2025 ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్ష సన్నద్ధతపై సోమవారం ఆమె సమీక్షించారు. పాలిటెక్నిక్, డిప్లమో విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులు ఈ కామన్ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. జిల్లాలో సుమారు 800 మంది ఈ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినవారు నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల, భట్లపాలెంలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటలకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారని తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో రెండు బ్యాచ్‌లకుగాను రోజుకు 400 చొప్పున రెండు రోజులు పరీక్షలు జరుగుతాయని, కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు, తాగునీరు, వసతి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాటు, మెడికల్ క్యాంపుల నిర్వహణ వంటివి ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. విద్యార్థుల రాకపోకలకు అనుగుణంగా ఆర్టీసీ సౌకర్యాలు కల్పించాల్సిందిగా డీఆర్వో సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు రామకృష్ణంరాజు, ఎ.కుమార్‌లు జేఎన్‌టీయూ తరపున పరిశీలకులుగా విజయకుమారి, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సింహాచలం ఘటనలో బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం
రూ.25 లక్షల వంతున చెక్కులు
అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే 7

భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు

- రేపటి నుంచి అన్నవరం సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు
- 8న దివ్యకల్యాణం, 11న రథోత్సవం
- 50వేలమంది విచ్చేస్తారని అంచనా
- ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు


కల్యాణోత్సవ ఏర్పాట్లను ఈవోతో కలిసి పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి

అన్నవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుని వార్షిక కల్యాణ ఘడియలు సమీపిస్తున్న వేళ అన్నవరం దేవస్థానం అధికార యంత్రాంగం భక్తుల సౌకర్యాల కల్పనకు ఇతర శాఖల సహకారంతో చర్యలు చేపడుతున్నట్టు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు ఈ నెల 7న ప్రారంభమై 13తో ముగుస్తాయన్నారు. ప్రధానంగా 8వ తేదీ రాత్రికి జరిగే దివ్యకల్యాణం, 11వతేదీ సాయంత్రం 4గంటలకు నిర్వహించే రథోత్సవం కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారని దీనికనుగుణంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవస్థానం ఇతరశాఖల సమన్వయంతో ఎక్కడా లోటుపాట్లు లేకుండా తగిన ప్రణాళికలతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 8న దివ్యకల్యాణం వీక్షించేందుకు సుమారు 50వేలమంది విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేశామన్నారు. పటిష్ఠమైన క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం నిరంతరం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. 8న సాయంత్రం 4గంటల నుంచి కొండపైకి భారీ వాహనాలను అనుమతించకుండా కొండదిగువ జూనియర్ కళాశాల మైదానంలో పార్కింగ్ సౌకర్యం కల్పించి అక్కడ నుంచి భక్తులను దేవస్థానం బస్సుల్లో ఉచితంగా కొండపైకి తీసుకెళ్లడం జరుగుతుందని, కల్యాణం అనంతరం 9 ప్రత్యేక కౌంటర్ల ద్వారా ముత్యాల తలంబ్రాల అక్షింతల పంపిణీ చేపడుతున్నామని ఈవో తెలిపారు. ఈ ఏడాది దివ్యకల్యాణోత్సవాలు వారంరోజులు మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు ఫైర్ ఇంజన్లు, వైద్యసదుపాయాల కోసం అంబులెన్సు, కొండపైన వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే దివ్యకల్యాణోత్సవ ఆహ్వానపత్రికలను ప్రముఖులకు అందజేయడం జరిగిందని ఆయన చెప్పారు. భక్తులు దివ్యకల్యాణం తిలకించి సత్యదేవుడి కృపకు పాత్రులుకావాలని ఈవో సుబ్బారావు కోరారు.

సింహాచలం ఘటన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి

అన్నవరంలో ఏర్పాట్ల పరిశీలన

ఇటీవల సింహాచలం దేవస్థానంలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకుని కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నవరంపై ప్రత్యేక దృష్టి సారించారు. సత్యదేవుని వార్షిక కల్యాణం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఆదేశాలతో సోమవారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి కల్యాణోత్సవ ప్రాంగణాన్ని పరిశీలించారు. కల్యాణం వీక్షించేందుకు భక్తుల సిట్టింగ్ సామర్థ్యం, బారికేడ్ల ఏర్పాటు, క్యూలైన్ వ్యవస్థ, విద్యుత్‌లైన్ వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు ఉన్నారు.

పెద్ద రథానికి ట్రయల్‌రన్

సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాల్లో ఈనెల 11న జరిగే రథోత్సవానికి వినియోగించే పెద్ద రథానికి సోమవారం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సమక్షంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. సుమారు 35 అడుగుల పొడవుల గల ఈ రథంతో కార్యక్రమం నిర్వహించడం అధికారులకు కత్తి మీద సాములా మారింది. గతేడాది ఈ రథోత్సవం ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు గ్రామంలో మెయిన్‌రోడ్డు మీదుగా జరగనుండడంతో గతేడాది గ్రామంలో విద్యుత్‌సరఫరా నిలుపుదలచేశారు. దీంతో గ్రామస్థులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఆ ఇబ్బందులు లేకుండా సెంటర్ లైటింగ్‌ను జనరేటర్ సాయంతో వెలిగించి కేవలం మెయిన్‌రోడ్డుపై విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి గ్రామంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరిగేలా దేవస్థానం విద్యుత్‌విభాగం, ఏపీఈపీడీసీఎల్ అధికారులు సంయుక్తంగా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ట్రయల్‌రన్ విజయవంతమైనట్టు అధికారులు తెలిపారు.


ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న అధికారులు

సింహాచలం ఘటనలో మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

రూ.25 లక్షల వంతున చెక్కులు అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే


కుంపట్ల శేషారావు తండ్రి శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అంబాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో గోడ కూలిన ఘటనలో జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారని, బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సింహాచలం చందనోత్సవ కార్యక్రమానికి వెళ్లి గత నెల 30న గోడ కూలిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. అంబాజీపేట గ్రామం కొర్లపాటివారిపాలెనికి చెందిన పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల ఈశ్వరమణికంఠశేషారావులు గోడకూలి మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కొర్లపాటివారిపాలెంలో స్వామినాయుడు తండ్రి పత్తి వీరవెంకట సత్యనారాయణ, శేషారావు తండ్రి శ్రీనివాసరావుకు చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు అందించారు. స్వామినాయుడు, మణికంఠ చిత్రపటాల వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, ఇన్‌చార్జ్ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, సుంకర బాలాజీ, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి వెంకటేశ్వరరావు, బాబి తదితరులు ఉన్నారు.

పాముగండిలో అంతు చిక్కని వ్యాధి

గుర్తించలేకపోతున్న అధికారులు

బాధపడుతున్న గిరిజనులు


అంతుచిక్కని వ్యాధితో మంచం పట్టిన పదేళ్ల చిన్నారి కోసు వర్షిణి

దేవీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరానికి 17 కిలోమీటర్ల దూరంలో దేవీపట్నం మండలం పాముగండి గ్రామంలో గిరిజనులు 20 రోజులుగా అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నారు. సుమారు 40మంది జ్వరాలతో అల్లాడిపోతూ పాదాల నుంచి మోకాళ్ల వరకు కాళ్ల వాపుతో మంచానపడ్డారు. వ్యాధి తగ్గకపోవడంతో గిరిజనులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే వైద్యాధికారులు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏ ర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించినా వ్యాధిని గుర్తించలేకపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని సర్పంచ్ శివారెడ్డి కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్ స్తంభంపై రవికృష్ణ మృతదేహం


ఫైల్‌ఫోటో

అంతర్వేది, మే 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూల గ్రామంలో అకాల వర్షాలకు తెగిపోయిన విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో గొర్ల రవికృష్ణ (35) మృతి చెందాడు. ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రవికృష్ణ గ్రామంలో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. రవికృష్ణకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. టీడీపీ కార్యకర్తగా ఉన్న రవికృష్ణకు క్రియాశీలక సభ్యత్వం ఉందని మండలాధ్యక్షుడు ఎమ్.నాని తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

గొల్లప్రోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారులోని చౌడు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్టు వీఆర్వో కె.మంగతాయారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, ఎటువంటి వివరాలు అందుబాటులో లేవని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 17 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1,2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17 మంది పట్టుబడారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 8 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, మరో 9మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

- రైతులకు అన్యాయం జరగదు
- మంత్రి నాదెండ్ల మనోహర్
- కాకినాడ జిల్లాలో తడిచిన ధాన్యం రాశుల పరిశీలన


జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట రూరల్/కాకినాడ రూరల్/ పెద్దాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సుడిగాలి పర్యటన చేశారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి పర్యటించి అకాల వర్షాలతో తడిచిపోయిన ధాన్యం రాశులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలతో తడిచిపోయిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు మంత్రికి విన్నవించుకున్నారు. నాదెండ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని హామీఇచ్చారు. తడిచిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దన్నారు. ఇక్కడి సమస్యను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పర్యటనకు వచ్చానన్నారు. జిల్లాలో 95వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసే విధంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. అవసరమైతే మరో 50వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు కూడా ఆలోచిస్తున్నామన్నారు. జగ్గంపేట మండలంలో 250 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి దృష్టికి నెహ్రూ తీసుకెళ్లగా అవసరమైతే 350 మెట్రిక్ టన్నులు అవసరమైన కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, నమ్మవద్దని వారి కుట్రలను తిప్పి కొట్టాలని రైతులను కోరారు. ఆయన వెంట జేసీ రాహుల్‌మీనా, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, సివిల్ సప్లై డీఎం దేవలనాయక్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, కుడా చైర్మన్ తుమ్మలబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ ఉన్నారు.

కాకినాడ రూరల్ మండలం చీడిగ హైవే రోడ్డుపై తడిసిపోయిన ధాన్యాన్ని మంత్రి మనోహర్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి పరిశీలించారు. రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిబంధనలు పాటించని రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్డీవో మల్లిబాబును ఆదేశించారు. పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో తడిసిన ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖను సమాయత్తంచేసినట్టు చెప్పారు.


కాకినాడ రూరల్ మండలం చీడిగలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి

పేదల వైద్యానికి సహకారం అమోఘం

కలెక్టర్ షాన్‌మోహన్

'కెఎస్‌పీఎల్' రూ.55 లక్షలతో జీజీహెచ్‌కు మౌలిక సదుపాయాలు


ఐసీయూలో పడకలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

జీజీహెచ్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ (కెఎస్‌పీఎల్) అందించిన సహాయ, సహకారాలు అమోఘమైనవని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ కొనియాడారు. జీజీహెచ్ ట్రామా కేర్ విభాగంలో సోమవారం కెఎస్‌పీఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సీఎస్‌ఆర్)లో భాగంగా రూ.55 లక్షలతో సమకూర్చిన 3 వెంటిలేటర్‌లు, 8 మల్టీపారా మానిటర్‌లు, 8 ఐసీయూ పడకలు, 8 గైనకాలజీ పరిశీలన బెంచీలను సంస్థ ఎండీ కెవిరావు, కలెక్టర్, ఎంపీ తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్ సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. పాండురంగ విఠల్‌కు అప్పగించారు. అనంతరం సర్జరీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు రూ.55 లక్షలతో మౌలిక సదుపాయాలను సమకూర్చడం అభినందనీయమని కేఎస్‌పీఎల్ ఎండీ కేవీ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ ఉదయ్ మాట్లాడుతూ నాలుగైదు జిల్లాల నుంచి నిత్యం రోగులు, క్షతగాత్రులు, గర్భిణులు వేల సంఖ్యలో జీజీహెచ్‌కు వస్తుంటారన్నారు. గతేడాది 8 లక్షలమంది అవుట్ పేషెంట్లు, 17 వేలమంది ఇన్‌పేషెంట్లు జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందగా, సుమారు 45 వేల సర్జరీలు జరగడం గర్వకారణమన్నారు. జీజీహెచ్ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులుగా తాము, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేశామన్నారు. జీజీహెచ్ భవిష్యత్తుతరాలకు వైద్య సేవలందించే నిష్ణాతులైన వైద్య నిపుణులను అందిస్తుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో త్వరలో జీజీహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలందించడంలో జీజీహెచ్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. గతంలో కెఎస్‌పిఎల్ జీజీహెచ్‌కు చాలాసార్లు సహకారాన్ని అందించదని గుర్తుచేశారు. ఎంసీ హెచ్ విభాగ నిర్మాణ పనులు పూర్తయితే 500 పడకలు నూతనంగా అందుబాటులోకి వస్తాయని తద్వారా ఆసుపత్రిపై భారం తగ్గి మరింత నాణ్యమైన వైద్య సేవలందించేందుకు దోహదపడుతుందన్నారు. కెఎస్‌పిఎల్ ఎండి కెవి రావును ప్రత్యేకంగా సత్కరించారు. కెఎస్‌పిఎల్ సీఈవో మురళీధర్, సీఎస్‌ఆర్ ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న, ఆర్థోప్రొఫెసర్ డాక్టర్ ముఖర్జీ ఉన్నారు.

'ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై రైతులకు అవగాహన అవసరం'


వ్యవసాయ సేద్య విధానాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొవ్వూరు, మే 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో జిల్లా ఏరువాక కేంద్రం, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. భరతలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, నూతన వంగడాలు, లాభదాయకమైన సేద్యం, మార్కెటింగ్, వివిధ పంటల దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు గత 4 నెలలుగా గ్రామాల్లో నైరా కళాశాల విద్యార్థుల కార్యకలాపాలను వివరించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అనువైన, అధిక దిగుబడులను ఇచ్చే సార్వా, దాళ్వా రకాలను సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.సీహెచ్‌వీ.నరసింహరావు, మానుకొండ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, ఎంపీటీసీ రోహిణి కోమలి, వ్యవసాయశాఖ కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్, శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుమల రెడ్డి, ఇంజనీరు అప్పారావు, అభ్యుదయ రైతులు, నైరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 4 బంగారు పతకాలు

సత్తా చాటిన కాకినాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు సాధించారు. జూన్‌లో బెంగళూరులో 40 దేశాలతో జరిగే ఏషియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన శ్రీనివాసరావును పలువురు అభినందించారు.



బంగారు పతకాలు అందుకుంటున్న డ్రైవర్ శ్రీనివాసరావు

పుట్టినరోజు వేడుకకు పయనమై..

ఆటో బోల్తా పడి ఒకరు మృతి, నలుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

గొల్లప్రోలు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళ మృతిచెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఆర్లంక రామలక్ష్మి, రౌతు సత్యవతి, అప్పలనరస, లక్ష్మి అదే గ్రామానికి చెందిన గోవిందు ఆటోలో కొత్తపల్లి మండలం గోర్సలో జరిగే బంధువుల కుమార్తె పుట్టినరోజు వేడుకలో పాల్గొనేందుకు బయల్దేరారు. తాటిపర్తి జంక్షన్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో సమీపంలోని పొలాల్లోకి బోల్తా పడి పల్టీలు కొట్టింది. ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యారు. తొలుత వారిని పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామలక్ష్మి (50) మరణించింది. రామలక్ష్మి భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘ సేవ, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యం

జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, ముగిసిన యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్ర స్థాయి శిబిరం


రెడ్‌క్రాస్ వలంటీర్లతో జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు

కాకినాడ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారతీయులు సంఘ సేవ, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తారని కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే.ప్రసాద్ అన్నారు. కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ, కాకినాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి శిబిరం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించినట్టు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఈ వేడుకలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ, సమాజసేవలో రెడ్‌క్రాస్ వలంటీర్లు ముందుండడం హర్షించదగ్గ విషయమన్నారు. వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కాకినాడ శాఖ చైర్‌పర్సన్ ఎన్.సుగుణారెడ్డి, కార్యదర్శి కె.శివకుమార్, ప్రిన్సిపాల్ కరుణ, శివరామకృష్ణతేజేశ్వరరావు, దుర్గాదేవి, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, చిరంజీవి, నాగరాజు ఉన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి రథోత్సవం

గోదావరి నదిలో స్వామివారికి త్రిశూల స్నానం

ఐ.పోలవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆఖరి రోజున గవ్యాంతం, కళాన్యాసం, వసంతోత్సవం వంటి పూజలు జరిగాయి. 70మంది వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మేళతాళాలతో ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను మురమళ్ళ పుష్కరాల రేవుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం వృద్ధగౌతమిలో స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులైన శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పుష్పోత్సవం, పవళింపుసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ రాజేష్ గురుకుల్ శిష్యబృందం ఐదురోజుల పాటు చేసిన అలంకరణలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు ముగింపు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని వీరేశ్వరుని పూజలు చేశారు.


మురమళ్ళలో శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యాలు



జేఈ పరీక్ష వాయిదా

యానాం, మే 5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈనెల 11వ తేదీ ఆదివారం జరగాల్సిన రాత పరీక్ష వాయిదా వేశామని పుదుచ్చేరి విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

ఐ.పోలవరం, మే5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జ్యుడీషియల్‌కోర్టుబార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది వడ్డి నాగేశ్వరరావును మండల మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. రేవు శ్రీనివాస్, మట్ట గగనవీరుడు, ములపర్తి శ్రీను, వడ్డిగౌతమ్, కాశి పరివాజ్ కుమార్, పండు మురళి, టి.రాంబాబుపాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర మహోత్సవాలు



అంతర్వేది: గొందిశ్రీకనకముత్యాలమ్మ, మామిడికుదురు: ముత్యాలమ్మ, గోగులమ్మఅమ్మవార్లు, కాట్రేనికోన మావుళ్ళమ్మతల్లి, ఉప్పూడి మల్లమ్మతల్లి

అంతర్వేది, మే 5 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం గొంది గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కనకముత్యాలమ్మవారి జాతర హోత్సవాలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతరలో గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు, వివిధ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు, బోనాల డ్యాన్సు నెమలి కాంతారా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలు కనువిందు చేశాయి. గొంది అగ్నికుల క్షత్రియుల సంఘం ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈనెల8వ తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముత్యాలమ్మ, గోగులమ్మకు పూజలు

మామిడికుదురు, మే 5(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ, గోగులమ్మ జాతర మహోత్సవాలను సోమవారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. జాతరలో చిత్రవిచిత్ర వేషధారణలు, సన్నాయి వాయిద్యాలు, తెలంగాణ బోనాల డ్యాన్స్‌లు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలతో కన్నుల పండుగగా జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటుచేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పణ, బుధవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

● జాతరలో గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, వివిధ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు, బోనాల డ్యాన్సు

శ్రీమసేనమ్మ అమ్మవారి జాతర

పి.గన్నవరం, మే 5(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీమసేనమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జాగరం జరుగుతుందని తెలిపారు. జాతర కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మల్లమ్మ, మావుళ్లమ్మ అమ్మవార్ల తీర్థం

కాట్రేనికోన, మే 5(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన, ఉప్పూడి గ్రామాల్లో మంగళవారం మావుళ్ళమ్మ, గంగాదేవరమల్లమ్మ తల్లుల తీర్థం జరగనుంది. సోమవారం రాత్రి అమ్మవార్ల పెదజాగారాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల ప్రధాన ఆసాదుల ఆధ్వర్యంలో తొలుత పూజ ఘటాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాలతో, అమ్మవార్ల గరగలతో ఆసాదులు నృత్యం చేస్తూ అమ్మవార్ల జన్మవృత్తాంతాలను దండక రూపంలో విన్పించారు. ఆలయాల ఉప ఆసాదులు గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాలు, బాణసంచా కాల్పులతో అమ్మవార్లు గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులుఅమ్మవార్లను దర్శించుకుని నైవేద్యాలు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఎస్‌ఐ అవినాష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పి.గన్నవరం తాటికాయలవారిపాలెం శ్రీమసేనమ్మ అమ్మవారు

ముత్యాలమ్మగుడి ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఇవ్వండి

● అక్కడ 20 కుటుంబాలు నివాసం
● విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించండి
● కొబ్బరి చెట్లకు తీగలు కట్టి దూర ప్రాంతం నుంచి విద్యుత్ సదుపాయం



కరెంటు స్తంభాలు లేకపోవడంతో కొబ్బరి చెట్లకు కట్టుకున్న విద్యుత్ సర్వీసు వైర్లు



దూర ప్రాంతాల నుంచి మురికి కాల్వ మీదుగా విద్యుత్ తీగలు అమర్చుకున్న దృశ్యం

మామిడికుదురు, మే 5(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలోని ముత్యాలమ్మగుడి ప్రాంతంలో 20కుటుంబాల వారు నివాసం ఉంటున్నాయి. అయితే ఆ ఇళ్లకు విద్యుత్ సరఫరా లేదు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలంటూ ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. దశాబ్ద కాలంగా ముత్యాలమ్మ గుడి వద్ద నుంచి శాలివాహనపేట వరకు తాము గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నప్పటికీ విద్యుత్ స్తంభాలు లేకపోవడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు లేకపోవడం వల్ల విద్యుత్ తీగలను కొబ్బరి చెట్లకు కట్టుకోవాల్సి వస్తుందని, దింపులు తీసే సమయంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు. 20కుటుంబాల వారు గృహాలకు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం దూర ప్రాంతాల్లో ఉన్న స్తంభాల నుంచి విద్యుత్ వైర్లను అమర్చుకోవడం వల్ల అనేక వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. 150నుంచి 200మీటర్ల దూరం నుంచి విద్యుత్ వైర్లను అమర్చుకుంటున్నామని పేర్కొంటున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప తమ ప్రాంత సమస్యను పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 21స్తంభాలు తమ ప్రాంతానికి అవసరం అవుతాయని, వాటిని ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా స్పందన లేదన్నారు.

'ముఖ్యమంత్రి సహాయనిధి' పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో 25మంది బాధిత కుటుంబాలకు 19.10లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. 11నెలల కాలంలో 231 మంది బాధిత కుటుంబాలకు రూ.2.21కోట్లు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, మల్లిపూడి సత్తిబాబు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దడాలకు నివాళి

యానాం, మే 5(ఆంధ్రజ్యోతి): యానాం విమోచనోద్యమం కోసం పోరాటం సాగించిన స్వాతంత్ర్య సమరయోధుడు దడాల రమణయ్య (రఫేల్)కు యానాంలో అధికారులు, నాయకులు ఘన నివాళులర్పించారు. యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో రమణయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, సీఐ అడలరసన్, ఎస్‌ఐ పూనిత్‌రాజ్, దడాల కుటుంబసభ్యులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు



క్రాప చింతలపూడిలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

ముమ్మిడివరం, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అకాల వర్షంతో రబీ వ్యవసాయ మాసూళ్లకు ఆదివారం తీవ్ర ఇబ్బందిని కల్పించినా సోమవారం వాతావరణం కొంత తెరిపివ్వడంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాలు చేపట్టారు. ఆకాశం మబ్బులుగా ఉన్న వర్షం మాత్రం పడకపోవడంతో రైతులు ధాన్యాన్ని ఎండబెట్టుకునే పనుల్లో బిజీబిజీ అయ్యారు. ధాన్యం రాశుల కిందకు వర్షపునీరు చేరడంతో వాటిని మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే కొంత మంది రైతులు ధాన్యం రాశులు ఎండబెట్టుకునే పనులు చేపట్టగా మరికొందరు మాత్రం ధాన్యం రాశులను సోమవారం కూడా బరకాలు కప్పి ఉంచారు. పల్లపు ప్రాంతాల్లో వేసిన ధాన్యపు రాశుల కిందకు వర్షపు నీరు చేరడంతో ధాన్యం మొలకెత్తడం ప్రారంభించిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాటిని మెరక ప్రాంతాల్లో వేసి ఎండబెట్టుకునే ప్రయత్నాలు చేపట్టారు. వరి చేలల్లో నీరు ఉండడంతో సోమవారం కూడా కోతలు సాగలేదు. జిల్లాలో 1,64,529 ఎకరాల్లో రబీ వరి సాగు చేపట్టగా ఇప్పటివరకు 80వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తి అయ్యాయి. ఇంకా 84,529 ఎకరాల్లో వరి చేలల్లోనే ఉంది. అయితే ఆదివారం కురిసిన వర్షాలు, వీచిన గాలులకు వరి అక్కడక్కడా నేలకొరిగింది. కోసిన 80వేల ఎకరాల్లోని ధాన్యం సుమారు 93వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయగా ఇంకా 2లక్షల 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దనే ఉంది. ఈ ధాన్యం రైతులు, బస్తాల రూపంలో ఉంది. ధాన్యం రాశుల కిందకు వర్షపు నీరు చేరడంతో కొంతమేర నష్టం కలుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. అసలే కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు అకాల వర్షాలు మరింత ఇబ్బందులకు గురి చేశాయి. ఉపాధి కూలీలను రైతులకు ధాన్యం ఎండబోసేందుకు వరి మాసూళ్లకు అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. నిబంధనలు సడలించి ధాన్యాన్ని కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మలేరియాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి



కొత్తలంక పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం, మే 5(ఆంధ్రజ్యోతి): మలేరియాను సమగ్రంగా అరికట్టేందుకు డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలని మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. కొత్తలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి పీహెచ్‌సీ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మలేరియాను అరికట్టడంలో ఫీల్డు స్టాఫ్ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ నార్ని శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు



వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరిన దృశ్యం

అయినవిల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ఎన్.పెదపాలెం గ్రామ సర్పంచ్ శీలం వెంకటేశ్వరరావు జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ సమక్షంలో సోమవారం జనసేనలో చేరారు. ఆయనతో పాటు 80మంది జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో ఎన్.పెదపాలెం గ్రామానికి చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, కుప్పాల రాంబాబు, సలాది బుచ్చిరాజు, వాసంశెట్టి కుమార్, చింతపల్లి సత్యనారాయణ, అడపా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రారంభోత్సవం

అయినవిల్లి మండలం ఎన్.పెదపాలెం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపురాజు సత్యనారాయణరాజు, డీవీవీ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

అంబాజీపేట, మే 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పంచాయతీ రాజ్ డీఈ అన్యం రాంబాబు అన్నారు. ఇరుసుమండ ప్రధాన రహదారిలో కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రాంబాబుతో పాటు వైద్యులు డాక్టర్ గంధం విశ్వనాథ్, డాక్టర్ అంబటి విజయరాజు ప్రారంభించారు. అనంతరం బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆహార నిధి ఆర్గనైజర్ వీరంశెట్టి రాంబాబు, సభ్యులు బండారు సురేష్, జగదీష్, పవన్, అయ్యప్ప, కాశి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుపై దృష్టి పెట్టాలి

అల్లవరం, మే 5(ఆంధ్రజ్యోతి): గోడి, గోడితిప్ప గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ సోమవారం తనిఖీ చేశారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లల ఆధార్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ క్యాంపుల గురించి గ్రామాల్లోని ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు.డీఏలు లోవరాజు, సుభాషిణి, మీనాకుమారి, సూర్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు మరో రెండు నెలలు పెంపు

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ఈకేవైసీ చేయిం చుకునేందుకు మరో రెండు నెలలపాటు గడు వును ప్రభుత్వం పెంచిందని మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన చెప్పారు. రేషన్‌కార్డు లబ్ధిదారులంతా ఈకే వైసీని చేయించుకునేందుకు తొలుత ప్రభు త్వం మార్చి 15 వరకు అవకాశం కల్పించిం దన్నారు. మార్చి 15 నాటికి అది పూర్తికాక పోవడంతో ఏప్రిల్ 30 వరకు పెంచారన్నారు. ఇప్పటికీ నూరుశాతం అది జరగకపోవటంతో జూన్ 30 వరకు గడువు పెంచిందన్నారు.

రాజోలు కోర్టు ఏజీపీగా రజిత



రాజోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజోలు సీనియర్, జూనియర్ కోర్టుల ఏజీపీ (అసిస్టెంట్ గవర్నర్ ఫీడర్)గా గుబ్బల రజిత నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు తనకు వచ్చాయని సోమవారం ఆమె తెలిపారు. రజిత 2004లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. 2014నుంచి రాజోలు న్యాయ సముదాయాల ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ కౌన్సిలర్‌గా, మీడియేటర్‌గా, లోక్‌అదాలత్ మెంబర్‌గా సేవలు అందించారు. ప్యానల్ లాయర్‌గా పలు గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇంటింటా ప్రచారంలో పాల్గొని మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు ఏజీపీగా కొనసాగుతానని తెలిపారు. ఏజీపీగా నియమకానికి కృషిచేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రాజోలు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కూటమి నాయకులకు ఆమె కృతజ్ఞతలుతెలిపారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాలంగికి సన్మానం

అల్లవరం, మే 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది యాలంగి సత్యనారాయణను దేవగుప్తంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, దళిత నేతల ఆధ్వర్యంలో దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. న్యాయవాది యాలంగి సత్యనారాయణ పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో దళిత నేతలు కాశి బాలయోగి, సాధనాల శ్రీనివాస్, సాధనాల రాజు, బడుగు సత్యనారాయణ, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు, గెద్దం విజయకుమార్ తదితరులు పాల్గొని అభినందించారు.

పహల్గాం ఉగ్రదాడి అమరులకు నివాళి

అయినవిల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన హిందూ బంధువులకు సోమవారం నేదునూరులో రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమ్మూకశ్మీర్ ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పి.విశ్వనాథం పాల్గొని పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. ఉగ్రదాడుల గురించి దేశ వ్యాప్తంగా ఇంటింటా చర్చ జరగాలని పిలుపునిచ్చారు. వివేకానంద కేంద్ర కన్యాకుమారి ప్రతినిధి సి.సదాశివరావు, వివేకానంద సేవాసమితి కార్యదర్శి గొవ్వాల నాగరాజు, రావిఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకటకృష్ణ, డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, డాక్టర్ కొమ్ముల రమణకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఐదుగురు దాడి

అంతర్వేది, మే 5(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని ఐదుగురు దాడిచేసి చితకబాదారు. అంతర్వేది దేవస్థానం గ్రామానికి చెందిన దిగమర్తి రమేష్ కొన్ని సంవత్సరాలుగా అంతర్వేది గ్రామంలో సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం కేశదాసుపాలేనికి చెందిన స్నేహితుడుతో రమేష్ ఫోన్‌లో మాట్లాడారు. ఫోన్‌లో రమేష్ మాట్లాడిన విషయాలు స్నేహితుడు ఇతరులకు చెప్పాడు. దీంతో ఐదుగురు వ్యక్తులు రమేష్‌ను ఒక చోటకు పిలిచి గట్టిగా కొట్టారు. ఈవిషయం రమేష్ ఎవరికి చెప్పలేదు. ఈవిషయం బంధువులు తెలుసుకుని రమేష్‌ను వివరాలు అడిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌ను చితకబాదిన వారి వివరాలు చెప్పడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు.

మహానాడును విజయవంతం చేయండి

మలికిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మే నెలలో జరిగే మహానాడును టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు అన్నారు. సోమవారం గుడిమెల్లంకలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చెల్లింగి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్, రాపాక నవరత్నం, ముత్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు దిగేందుకు చర్యలు

అంబాజీపేట, మే 5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా ముంపునీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు ఆధ్వర్యంలో డ్రైన్లను శుభ్రం చేయించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగునీటిలో చెత్తచెదారాన్ని తొలగించి ముంపు నీరుదిగేందుకు చర్యలు చేపట్టారు.స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక మాతృ పూజోత్సవం



తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

మామిడికుదురు, మే 5(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని శివాలయ ఆవరణలో సామూహిక మాతృ పూజోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా మాతృమూర్తి, ఈశ్వరమ్మ సంస్మరణలో భాగంగా చిన్నారులు తల్లుల కాళ్లు కడిగి పాదపూజ చేశారు. అనంతరం చిన్నారులకు ఏర్పాటుచేసిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. భక్తులు ఆలపించిన భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆధ్యాత్మిక గీతాలు భక్తుల మనసులను రంజింప చేశాయి. అల్లూరు పద్మనాభరాజు, సీహెచ్ భవానీ, పి.పలదాంబ పాల్గొన్నారు.

కవి చంద్రశేఖర్‌కు సత్కారం

రాజోలు, మే 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎల్ఐసీఉద్యోగుల భవనంలో అంబేడ్కరీయం కవుల, గాయకుల సమ్మేళనాన్ని గుబ్బల రాంబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని నేటి యువతకు అర్థమయ్యేలా కార్యాచరణ చేపట్టి యువతకు చేరువయ్యేలా కవులు, గాయకులతో సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పొన్నమండకు చెందిన కవి గంటి చంద్రశేఖర్ సమ్మేళనంలో పాల్గొని కవితా గళాన్ని వినిపించి నిర్వాహకుల ప్రశంసలు పొందారు. చంద్రశేఖర్‌ను నిర్వాహకులు శాలువా, మెడల్, నగదు అందజేసి సత్కరించారు.

ప్రమాదకరంగా బి.దొడ్డవరం రహదారి



బి.దొడ్డవరంలో గోతులు పడి ప్రమాదకరంగా మారిన రహదారి

మామిడికుదురు, మే 5(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరంలోని ఆర్‌అండ్‌బీ రహదారి గోతులు పడి అధ్వానంగా తయారైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గోతులు పడిన రోడ్డుకు తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంభవించిన వర్షాలు, వరదలకు రోడ్డు మళ్లీ గోతులమయమై ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ఈగోతుల్లో పడి పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారు. రాత్రి సమయంలో ఈరోడ్డుపై ప్రయాణం అంటే నరక ప్రయాంగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. ఈరోడ్డుపై నుంచి బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు ప్రయాణిస్తున్నారు. ఈరోడ్డును ఆధునీకరించి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

మామిడికుదురు, మే 5(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అప్పనపల్లి శ్రీబాలబాలాజీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన కోట సత్యసాయిబాబు గత ఏడాది నవంబరు నెలలో మృతిచెందాడు. సాయిబాబుతో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి రూ.65వేల నగదు, రూ.5వేలు కిరాణా సరుకులు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'జముకు దీర్ఘ కావ్యం' పుస్తకావిష్కరణ

రాజోలు, మే 5(ఆంధ్రజ్యోతి): దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు, ఉద్యమ కవి బత్తుల మురళీకృష్ణ రచించిన జముకు దీర్ఘ కావ్యం పుస్తకం ఆవిష్కరణ జరిగిందని దళిత చైతన్యవేదిక నాయకులు తెలిపారు. ఈసందర్భంగా రాజోలులో సోమవారం దళిత చైతన్యవేదిక నాయకులు మట్టా సురేష్‌కుమార్, రాజోలు వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు అంబేడ్కర్ సామాజిక భవనంలో కుసుమ ధర్మన్న సాహిత్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కవి కోలాటి పెద్దిరాజు అధ్యక్షతన మొదటితరం దళిత కవి కుసుమ ధర్మన్న జయంత్యుత్సవాల కార్యక్రమాల్లో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు మురళీకృష్ణ రచించిన జముకు దీర్ఘ కావ్యం పుస్తకాన్ని ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి, బహుజన రచయితల వేదిక ప్రతినిధులు నేలపూడి రత్నాజీ, తంగిరాల సోనీ, ముస్లిం రచయితల సంఘ ప్రతినిధి షేక్ ఆలియా ఆవిష్కరించారని తెలిపారు. జముకు పుస్తక ముద్రణకు ఆర్థిక తోడ్పాటు అందించిన ఎన్ఆర్ఐ మిత్రులు తాడి విజయ్‌కుమార్, తాడి శ్రీనివాస్‌లకు పుస్తక రచయిత మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిలకపాటి శ్రీధర్, మెడబల శేఖర్, చింతా శ్రీనివాస్, అడ్వకేట్ చోడదాసు శ్రీధర్ పాల్గొన్నారు.

సీసీ కుటుంబానికి న్యాయం చేయాలి

మలికిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభ సభకు వెళ్లి తిరిగి వస్తుండగా ఉంగుటూరులో రోడ్డు ప్రమాదంలో మండల సమాఖ్య కోఆర్డినేటర్ నాగరాజు మృతి చెందగా, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మండల సమాఖ్య సభ్యులు, డ్వాక్రా యానిమేటర్ల సంఘం కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నాగరాజు భార్యకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాస్తానన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా అందేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా నాగరాజు ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సంఘ సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలకు గిరాకీ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకుడు ఈలి శ్రీనివాస్ తదితరులు

మామిడికుదురు, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందని రాజోలు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటుచేసిన స్టాల్‌ను అనంతపురం మోడల్ మేకర్ ట్రైనీ ఓబులేసు సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన స్థానిక రైతులతో మాట్లాడుతూ ప్రతీ రైతు విధిగా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. స్థానిక నాయకులు వర్తినేని వెంకట్రామయ్య, సాపే ఏకాదశి, నయినాల శ్రీరంగనాథం, ప్రకృతి వ్యవసాయ రైతులు చెల్లుబోయిన రాధ, కుడుపూడి జానకి పాల్గొన్నారు.

'ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి'

ఉప్పలగుప్తం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే దాళ్వా ధాన్యాన్ని కొనుగోలు చెయ్యాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెం, వడ్డిచెరువుల్లో ఆయన కళ్ళాల్లో ధాన్యం రాశులను పరిశీలించారు. కష్టపడి పండించుకున్న ధాన్యాన్ని అమ్ముకోలేని స్థితిలో ఉన్నామని రైతు యాళ్ళ లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం రాశులను కాపాడుకోవడం కష్టంగా ఉందన్నారు. అయినకాడికి ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజానాగకుమారి, అమలాపురం, పి.గన్నవరం, రామచంద్రపురం ఇన్‌చార్జులు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, పిల్లి సూర్యప్రకాష్, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిషోరి వికాసం శిక్షణలో పలు అంశాలపై అవగాహన



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 15 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో కిశోరి వికాసం పేరిట శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు పలు కార్యక్రమాలు చేపట్టేలా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికా రులు ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బాలికలకు 12 అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

కార్యాచరణ ఇలా: వారంలో రెండు రోజులు ఎంపిక చేసిన అంశాలపై అవగాహన కల్పించ డం, ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో గంటపాటు శిక్షణ ఇస్తారు. జిల్లాలోని 40వేల మందికి ఈ కార్య క్రమం వల్ల ప్రయోజనం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి సచివాలయానికి పుస్తకా లను ప్రభుత్వం సరఫరా చేసిందని ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి పలు అంశాలపై వారికి అవగాహన కల్పిస్తారని తెలిపారు. వచ్చేనెల 10న క్రీడల్లో రాణించడానికి వ్యాయామాలు, కళలు, సాంస్కృతిక అంశాలు వివరిస్తారన్నారు. గ్రామ సభలు నిర్వహించి బాలికల సంరక్షణ, బడి మానేసిన వారిని తిరిగి చేర్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.70 లక్షలు

ఆత్రేయపురం, మే 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,70,276 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన ప్రసాద భవన నిర్మాణానికి కొత్తపేటకు చెందిన తురగా సత్యనారాయణమూర్తి, గోపాల కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందచేశారు.

పంటబోదెల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు



ఆలమూరు మండలం పెదపళ్లలో పంట బోదెను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): పంటబోదెలు, కాలువల్లో ప్లాస్టిక్‌తోపాటు ఇతర వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అన్నారు. పెదపళ్ల గ్రామ పరిధిలో ఉన్న పంటకాలువ నుంచి వచ్చే బోదె ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఈ బోదెలో ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు మురికికాలువగా మార్చారని దీంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో పంటబోదెని ఎంపీడీవో రాజు, పంచాయతీ కార్యదర్శి వేణితోపాటు గారపాటి శ్రీనివాస్ పరిశీలించారు. వ్యర్థాలను తక్షణం తొలగించే చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. పంట కాలువల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం



రావులపాలెం తహశీల్దారుకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఎన్‌ఎంయూపీ సభ్యులు

రావులపాలెం, మే 5(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ రావులపాలెం డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ సభ్యులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ ఏపీపీటీడీలో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించే 1/2019 సర్క్యులర్‌ను కేంద్ర కార్యాలయం ఇచ్చినప్పటికి కింద స్థాయి అధికారులు అమలు చేయకుండా సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించాలంటూ వారు తహశీల్దారు ముక్తేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ ఏఎస్ నారాయణ, సెక్రటరీ బి.ఏసేబు, జోనల్ మెంబర్ వీఎస్ నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

ఆత్రేయపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఏడవ రోజు వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ.సరోజిని, కె.రత్నంరాజు వివిధ కథలు, పద్యాలు, జనరల్ నాలెడ్జ్ అంశాలతోపాటు ప్రపంచ పఠంలోని దేశాలు, ఖండాలను వారు తెలిపారు. గ్రంథాలయాధికారి నమ్మశివాయ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

చెరువు తవ్వకాలకు శ్రీకారం



ఆలమూరులో బోడిచెరువు తవ్వకాలను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

ఆలమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు బోడిచెరువు తవ్వకాలను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సోమవారం ప్రారంభించారు. చెరువు మెరక కావడంతో ఉపాధి హామీ పథకంలో తవ్వకాలు చేయడానికి నిధుల కేటాయించారు. 279 మంది ఉపాధి కూలీలతో ఏడు వేల పనిదినాలు చేసి తవ్వకాలు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం సర్పంచ్ నాతి లావణ్య, ఎంపీవో అరుణకుమారి, కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్ కుమార్, ఈదల నల్లబాబు, రామాంజుల శేషగిరిరావు, బైరిశెట్టి రాంబాబు, ఈదల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి



బీజేపీలో చేరుతున్న సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు

రామచంద్రపురం(ద్రాక్షారామ) మే 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు సోమవారం బీజేపీలో చేరారు. వక్ఫ్ చట్టం 2025 అవగాహన సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమ సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలిలో గాంధీ విగ్రహానికి పుష్పాలతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఉగ్రదాడిని ఖండించిన చిన్నారులు

ఆత్రేయపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ర్యాలి శ్యామ్‌జాదుగర్ ఆధ్వర్యంలో 1929 మే 5న గాంధీజీ ర్యాలి సందర్శించి విదేశీ వస్తు బహిష్కరణలో పాల్గొన్న సందర్భంగా గాంధీ వచ్చిన వేళ కార్యక్రమం ద్వారా చిన్నారులు ప్రపంచ శాంతి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పాకిస్తాన్ ఉగ్రదాడులను ఖండించారు. గాంధీ విగ్రహానికి చిన్నారులు పుష్పాలతో నివాళులర్పించారు. ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలి

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని కాంగ్రెస్‌పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. సోమవారం అమరావతిలో సివిల్ సప్లయి శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్‌ను కలిసి రైతుల ఇబ్బందులను వివరించినట్టు ఆయన తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కొత్తపేట, మే 5(ఆంధ్రజ్యోతి): మందపల్లి మందేశ్వర(శనేశ్వర) స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సమాజ సేవలో భాగస్వాములయ్యే వారంతా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ధర్నాల రామకృష్ణ, ముద్రగడ సుబ్బారావు, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

12న విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈనెల 12న చైత్ర పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. సోమవారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పీఠంలో విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి భక్తులతో సామూహిక శ్రీచక్రరాచ్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన జరుపుతామన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.



అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వర స్వామి, ట్రస్టు బోర్డు ఛైర్మన్ వంటిపల్లి సతీష్ కుమార్‌ల అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు అంగర వేణుగోపాలాచార్యులు, అంగర శింగుబాబులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై వాటిని ఉంచి వేణుగోపాలాచార్యులతోపాటు పలువురు వేదపండితులు పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరుతోపాటు పలు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏఎన్‌ఎంలకు శిక్షణ

ద్రాక్షారామ, మే 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సచివాలయంలోని వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్‌ఎంలకు యువిన్ వ్యాక్సినేషన్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. గర్భిణిలకు, అప్పుడే జన్మించిన శిశువుల మొదలు అయిదేళ్ల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయాలని వక్తలు తెలిపారు. వాటి వివరాలు యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని వ్యాక్సినేషన్ జిల్లా మేనేజరు సునీల్ తెలిపారు. సబ్ డివిజనల్ మెడికల్ అధికారి డాక్టర్ ఎన్.ప్రశాంతి మాట్లాడుతూ యువిన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో వెంకటేశ్వరరావు, సీహెచ్‌వో వీరవేణి, డివిజనల్ సూపర్‌వైజర్ కమలేశ్వరి, పలువురు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జల్లిపేట వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం ఉదయం జల్లిపేట కార్మికులు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు నూకల బలరామ్, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే బండారు హితవు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాలులో ఎంపీపీ కర్రి లక్ష్మివెంకటనాగదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాలు రానున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు పుష్కరఘాట్లు, అక్కడకు వెళ్లే మార్గాలు, విద్యుత్ లైన్లు తదితర వాటిపై నివేదికలు సిద్ధం చేసి అందచేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడలో వ్యవసాయశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పాల్గొని జిల్లాకు టార్గెట్ పెంచే దిశగా చర్చిస్తామన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో మహేష్, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక పురోభివృద్ధికి కృషి: మహిళలకు ఆర్థిక పురోభివృద్ధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో రైతు సేవా కేంద్ర భవనంలో ఏర్పాటు చేసిన మహిళల కుట్టుశిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

కొత్తపేట, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం వాడపాలెం జడ్పీ హైస్కూల్ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎన్.హారిక, బండారు యశ్వంతి, మనీషా, జోత్స్న, సౌమ్య, పూజ, అశ్వినిదీప్తిలను ఆయన జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

ఈకేవైసీ గడువు మరో రెండు నెలలు పెంపు

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించుకునేందుకు మరో రెండు నెలలపాటు గడువును ప్రభుత్వం పెంచిందని మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన చెప్పారు. రేషన్‌కార్డు లబ్ధిదారులంతా ఈకేవైసీని చేయించుకునేందుకు తొలుత ప్రభుత్వం మార్చి 15 వరకు అవకాశం కల్పించిందన్నారు. మార్చి 15 నాటికి అది పూర్తికాకపోవడంతో ఏప్రిల్ 30 వరకు పెంచారన్నారు. ఇప్పటికీ నూరుశాతం అది జరగకపోవటంతో జూన్ 30 వరకు గడువు పెంచిందన్నారు. ఈ అవకాశాన్ని రేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకుని ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన తెలిపారు.

ఏడిదలో ఆధార్ శిబిరం ఏర్పాటు

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామంలో సోమవారం నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలు తప్పనిసరిగా వేలిముద్రలను అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. ప్రజలు ఆధార్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి



కె.గంగవరంలో ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

కె.గంగవరం, మే 5(ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చాలా గ్రామాల్లో ధాన్యం తడిసిపోయిందన్నారు. వెంటనే రైతులను ఆదుకోవాలని కె.గంగవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద వారితో కలిసి ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రబీ పంటలో ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. అనంతరం తహశీల్దార్ బండి మృత్యుంజయరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వీ.భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు మద్దతు ధర ఇప్పించండి: రబీలో రైతు పండించిన పంటకు మద్దతు ధర రావడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి రైతుకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు విజయనగరం జోన్ ఆర్టీసీ మాజీ ఛైర్మన్ నెక్కంటి బాలకృష్ణ కోరారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం పంపించారు. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికులు ఈశ్రమ్ కార్డులు నమోదు చేసుకోవాలి



వెదురుపాకలో ఈశ్రమ్ కార్డులు నమోదు చేస్తున్న దృశ్యం

రాయవరం, మే 5(ఆంధ్రజ్యోతి): కార్మికులు తప్పనిసరిగా ఈశ్రమ్ కార్డు కలిగి ఉండాలని కార్మికశాఖ జూనియర్ అసిస్టెంట్ సుధ సూచించారు. సోమవారం వెదురుపాక గ్రామంలో ఈశ్రమ్ కార్డుల నమోదు కోసం గ్రామసభ నిర్వహించారు. బహుళ ప్రయోజనాలు కలిగిన ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కార్డులు పొందడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. అనంతరం సిబ్బంది సుప్రియ, వీరబాబు పలువురు కార్మికులకు ఈశ్రమ్ నమోదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ బిల్డింగ్ వర్కర్స్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కె.శ్రీదేవి, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి చంటిరెడ్డి, టీడీపీ నాయకులు వడ్డాది చిన్నకృష్ణంరాజు, సత్తి శ్రీనివాస రెడ్డి, జనసేన నేత రాజేష్, పవన్, శేఖర్, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో అఖిలకు వినతిపత్రం ఇస్తున్న డిపో కమిటీ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఆర్డీవో అఖిలకు వినతిపత్రం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ ఎన్‌ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు పలువురు ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. ఏపీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయు డిపో కార్యదర్శి బి.ముత్యాలరావు, అధ్యక్షుడు సీహెచ్‌వీ రావు, పలువురు ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు.

సికిల్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



కపిలేశ్వరపురంలో సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం, మే 5(ఆంధ్రజ్యోతి): సికిల్ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారని, వెంటనే చికిత్స తీసుకోకపోతే తక్కువ వయసులోనే చనిపోతారని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రత్నకుమారి అన్నారు. సోమవారం అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, పంచాయతీల పరిధిలో పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుపగా 45 మందికి వ్యాధి లేదని నిర్ధారించినట్లు తెలిపారు. ఈ వ్యాధి ఉన్నవారు తక్షణమే చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, ల్యాబ్‌టెక్నీషియన్ అలీ, ఏఎన్‌ఎంలు శిరోమణి, రూన్సీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 8 నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, మే 5(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో ఉన్న పార్వతీపాపవినాశేశ్వరస్వామి, అగస్త్యేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాలు ఈనెల 8న ప్రారంభమై 13వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. సోమవారం ఆయన కల్యాణోత్సవాల షెడ్యూల్‌ను తెలిపారు. గురువారంనాడు గ్రామోత్సవం, ధ్వజారోహణ, కల్యాణోత్సవం, 9న విశేషార్చన, నిత్యహోమం, బలిహరణ, 10న సదస్య మహోత్సవం, 11న స్వామివారికి విశేషార్చన, నిత్యహోమం, బలిహరణ, 12న త్రిశూలస్నానం, పూర్ణాహుతి, గ్రామోత్సవం, ధ్వజారోహణ, 13న స్వామివారికి పుష్పయాగోత్సవం, పవళింపు సేవలో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కాశధరి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులతో ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన పలు చలివేంద్రాలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలో పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ యువనేత వీ.సాయికుమార్‌బాబు తదితరులు ప్రారంభించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులను వారు అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, బొబ్బా రామకృష్ణ, టీడీపీ నేతలు మల్లిపూడి గణేశ్వరరావు, కాళ్లకూరి శ్రీనివాస్, వాకచర్ల గుప్త, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

చెరువు పూడికతీత పనులు ప్రారంభం

కపిలేశ్వరపురం, మే 5(ఆంధ్రజ్యోతి): రావులచెరువు మట్టిపూడికతీత పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. వీటి పనులను సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రామికుల జీవనోపాధి మెరుగుపడేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ నాగూర్ మాట్లాడుతూ 3వేల పనిదినాలతో వీటి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు కొరపాటి రాంబాబు, కూటమి నాయకులు నామాల బొజ్జియ్య తదితరులతోపాటు శ్రామికులు, మేట్లు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు కృషి చేద్దాం

ఆత్రేయపురం, మే 5(ఆంధ్రజ్యోతి): సారా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అమలాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అమరనాథ్, ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని పేర్కొన్నారు. సోమవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వెలిచేరులో నాటుసారా నిర్మూలన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అందరి భాగస్వామ్యంతో సారా రహిత సమాజాన్ని నిర్మించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అన్నవరం, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఐనం నాగరాజు, కవల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు అనుమతి

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, మే 5(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యానికి అదనంగా మరో లక్షమెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మంత్రి నాదెండ్ల మనోహర్ అంగీకరించారని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల చెప్పారు. కాకినాడలో సోమవారం జరిగిన పౌర సరఫరాలశాఖ అధికారులతో మంత్రి నాదెండ్ల నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

విద్యార్థుల కిట్‌ల స్టాక్ పరిశీలన

కె.గంగవరం, మే 5(ఆంధ్రజ్యోతి): పామర్రు ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర(స్టూడెంట్ కిట్స్) స్టోరేజ్ పాయింట్‌ను రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి సోమవారం పరిశీలించారు. స్టాకు వివరాలు ఆయన తెలుసుకున్నారు. పాఠశాల తెరిచేనాటికి విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో 2 చోడిశెట్టి ఆంజనేయులు, సీఆర్‌పీలు జుత్తుగ నాగబాబు, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించిన టీడీపీ నాయకుడు

ఆలమూరు, మే 5(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కొత్తపేట నుంచి ఎమ్మెల్యేగా సత్యా నందరావు, ముఖ్యమంత్రిగా చంద్రబాబు విజయం సాధించాలని టీడీపీ నాయకుడు ముప్పిరి వెర్రియ్య మొక్కుకున్నారు. ఈ నేపథ్య ంలో సోమవారం గౌరిపట్నంలోని మేరీమాత ఆలయానికి వెళ్లి మొక్కు చెల్లించారు. ఆల మూరు నుంచి కాలినడకన అక్కడకు వెళ్లి కుటుంబ సభ్యులతో మొక్కు చెల్లించారు.